క్లుప్తంగా

నేడు డివిజన్లలో జగనన్న సురక్ష

మచిలీపట్నంటౌన్:జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నగరంలోని 4, 5, 6, 7, 8, 9 డివిజన్లలో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నాల్గవ డివిజన్‌లోని కొబ్బరితోట-1లో, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు 5వ డివిజన్‌లో చిలకలపూడి-1లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 6వ డివిజన్‌లోని కొబ్బరితోట-2 లో, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు 7వ డివిజన్‌లోని చిలకలపూడి-2 లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 8వ డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీలో, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు 9వ డివిజన్‌లోని పరాసుపేట సెంటర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అధికారులు మూడు బృందాలుగా పాల్గొననున్నారు.

వైభవంగా సామూహిక సత్యవ్రతం



భావదేవరపల్లి(నాగాయలంక):టీటీడీ, కృష్ణా జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మనగుడి కార్యక్రమంలో భాగంగా సోమవారం సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం వైభవంగా నిర్వహించారు. స్థానిక చారిత్రక ప్రసిద్ధి కలిగిన శ్రీదేవి, భూదేవి సమన్విత శ్రీరాజ్యలక్ష్మీ సమేత శ్రీభావనారాయణ స్వామి ఆలయంలో అంబా సాయికిరణ్ శర్మ, రాజేంద్ర బ్రహ్మత్వంలో జరిగిన వ్రతంలో 60 జంటలు పీటలపై కూర్చున్నారు. పరిషత్ మండల ధర్మాచార్యులు రేమాల శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఆలయ ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, అద్దంకి నరసింహారావు, అర్జా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

7న గణపేశ్వరం దుర్గమ్మకు ఆషాఢ వేడుక

గణపేశ్వరం(నాగాయలంక):ఆషాఢ మాసం పురస్కరించుకుని గ్రామంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన దుర్గా-గణపేశ్వరస్వామి ఆలయంలో దుర్గదేవి, గణపేశ్వరస్వామి ఆలయాల్లో 7వ తేదీన ఆషాఢ సారె, శాకంబరి ఉత్సవం చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి(రాంబాబు), నిర్వాకురాలైన ఎంపీటీసీ మాజీ సభ్యురాలు తలశిల స్వర్ణలత సోమవారం తెలిపారు. అర్చకుడు పోతుకూచి సత్యనారాయణశాస్త్రి నేతృత్వంలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లుతో ప్రత్యేక అలంకారం తదుపరి అమ్మవారికి ఆషాఢసారె కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి గ్రామాల్లో ఉపాధి పనుల సామాజిక తనిఖీ

బంటుమిల్లి :మండల పరిధిలోని గ్రామాల్లో 2022-2023 ఆర్థిక సవంత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై మంగళవారం నుంచి సామాజిక తనిఖీ బందం పర్యటించి పనులను పరిశీలిస్తుందని ఎంపీడీవో జె. స్వర్ణభారతి తెలిపారు. సోమవారం కార్యాలయంలో ఆడిట్ సభ్యులు, ఉపాధి అధికారులు, సిబందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022-23 సంవత్సరంలో సుమారు 10 కోట్ల రూపాయల విలువ చేసే పలు శాఖలకు చెందిన 1600 పనులు జరిగాయన్నారు. పంచాయతీ రాజ్ , సర్వ శిక్ష అభియాన్ పనులపై సామాజిక తనిఖీ బృందం పనులను పరిశీలిస్తుందన్నారు. పలు శాఖల ఏఈలు, ఎస్ ఎస్ ఏ అధికారులు, స్టేట్ రిసోర్స్ పర్సన్, సామాజిక తనిఖీ విభాగం, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు ఎంఈఓగా శేఖర్ సింగ్

గూడూరు:గూడూరు మండల విద్యాశాఖ అధికారిగా బొందిలి బిఎస్‌సి శేఖర్ సింగ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులోని ఎస్‌వీవీజీఆర్ గవర్నమెంట్ హైస్కూలు హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్న శేఖర్ సింగ్‌ను గూడూరు ఎంఈవో-1గా నియమిస్తూ కాకినాడ జోన్-2 ఆర్జేడీ నాగమణి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం గూడూరు విద్యాశాఖ కార్యాలయానికి వచ్చిన సింగ్ ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. శేఖర్ సింగ్ గతంలో బందరు మండలం ఇన్‌చార్జి ఎంఈఓగా పని చేసి ఉన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషిచేద్దాం

గుడివాడ టౌన్: ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌ల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజీఎస్ కుమార్ అన్నారు. కళాశాలలో సోమవారం ప్లాస్టిక్ బ్యాగ్ వ్యతిరేక దినోత్సవాన్ని జరిపారు. విద్యార్థులు ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకం వలన వచ్చే దుష్పరిణామాలను వివరిస్తూ ప్లేకార్డులతో ప్రదర్శన చేశారు. వాటికి ప్రత్యామ్నాయంగా కాటన్, జ్యూట్ బ్యాగులను వినియోగించాలని సూచించారు.

పేదల బతుకుల్లో విద్యా వెలుగులు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

చల్లపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేస్తున్న అద్భుతమైన విద్యా విధానంతో పేదల బతుకుల్లో విద్యా వెలుగులు నిండుతున్నాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఎస్ఆర్ వైఎస్‌పీ జూనియర్ కళాశాలలో సోమవారం జగనన్న అమ్మ ఒడి సభ జరిగింది. చల్లపల్లి మండలంలో 3,717 మంది లబ్ధిదారులకు రూ.5,57,55,000 చెక్కు తల్లులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లీష్ మీడియం విద్యా బోధనను టీడీపీ నాయకులు మాతృభాష పేరుతో అడ్డుకునే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లీష్‌లో అద్భుతంగా మాట్లాడుతున్నారని చెప్పారు. టాబ్స్ వినియోగిస్తూ ఉత్తమ ప్రతిభావంతులుగా దూసుకువెళుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఒడి, నాడు-నేడు, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, విదేశీ విద్య, గోరుముద్ద ఇలా ఎన్నో గొప్ప పథకాలు అమలు చేస్తూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలో విద్య, వైద్యంకు కీలక ప్రాధాన్యత ఇచ్చి విస్తృత కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, ఎంపీడీఓ సీహెచ్ చినరాట్నాలు, ఎంఈఓ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు వల్లూరు ఉమా, డొక్కు నాగేశ్వరరావు, మాతంగి రమ్య, తోట శ్రీనివాసరావు, పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీలు మహమ్మద్ షాహెదున్నీసా బేగం, నూకల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు బొందలపాటి లక్ష్మి, ఈఓఆర్డీ అశోక్, హెచ్ఎం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

ప్రజలు మరోసారి జగన్ పాలన కోరుకుంటున్నారు

లక్ష్మీపురం(చల్లపల్లి): రాష్ట్ర ప్రజలు మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. లక్ష్మీపురం, నూకల వారిపాలెంల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రమేష్ బాబు 400 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గడపలో తమకు అపూర్వ స్వాగతం లభిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రధాన కారణం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు శీరం వెంకట సత్యానారాయణ, పాగోలు ఫణి, ఎంపీటీసీ నూకల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు బొందలపాటి లక్ష్మి, మట్టా ప్రకాష్, కుటుంబరావు, వెనిగళ్ల తారక జగదీష, ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, హౌసింగ్ ఏఈ అరుణ కుమారి, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, వీఆర్వోలు కిరణ్, అమలేశ్వరరావు, గోపీకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ యడ్ల జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి

నాగాయలంక: మండలంలో పలుచోట్ల గురు పౌర్ణమి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు కిటకిటలాడారు. ఆలయ అర్చకులు పెద్దాడ శ్రీనివాసశాస్త్రి నేతృత్వంలో అభిషేకాలు, విశేషపూజలు జరిగాయి. ఆలయంలో బాబావారిని ప్రత్యేకంగా అలంకరించారు. దాతల ఆర్థిక సౌజన్యంతో 2వేల మంది భక్తులను అన్నసంతర్పణ జరిపారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వర్రే సుమన్, మద్ది వెంకటేశ్వరరావు, రాచంశెట్టి పాపారావు, బీమా బాబూరావు, లేబాక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. భావదేవరపల్లిలోని షిర్డీసాయిబాబా సత్సంగ మందిరం, తలగడదీవి, నంగేగడ్డ, భావదేవరపల్లి గ్రామాల్లోని షిర్డీసాయి సేవాశ్రమం ఆధ్వర్యంలోని సాయిబాబా మందిరాలలో గురు పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరిపారు.

బంటుమిల్లి: పలు గ్రామాల్లో కొలువై ఉన్న సాయి మందిరాల్లో గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. బంటుమిల్లి, పెందురు, జానకిరామాపురం, సాయినగర్ గ్రామ సాయి మందిరాలకు భక్తులకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

మచిలీపట్నంటౌన్:నగరంలోని పలు షిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కోర్టు సెంటరులో సాయిబాబా మందిరానికి భక్తులు పోటెత్తారు. ప్రభుత్వాసుపత్రి, గుప్తాసెంటరు, హౌసింగ్‌బోర్డు, భాస్కరపురం, రాజుపేట, బలరామునిపేట తదితర ప్రాంతాల్లో ఉన్న సాయిబాబా ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



నాగాయలంకలో ప్రత్యేక అలంకారంలో సాయిబాబా



బలరామునిపేటలోని సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు



కోడూరులో సాయిబాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కోడూరు:గురుపౌర్ణమి వేడుకలను కోడూరు, చుట్టూ పక్కల గ్రామాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక శ్రీషిర్డిసాయి దివ్యజ్ఞాన ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తజనం క్షీరాభిషేకంలో పాల్గొని భక్తి భావం చాటుకున్నారు. సాయిబాబా విగ్రహాన్ని ప్రత్యేక పల్లకీలో ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. లింగారెడ్డిపాలెంలోని షిర్డిసాయి మందిరంలో వేడుకలు నిర్వహించారు.

మోపిదేవి:మండలంలో నూతక్కి శివబాబు, వాణి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సాయిబాబాకు పూజలు చేశారు. ఎంపీపీ రావి దుర్గావాణి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, పరుచూరి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

పెడన:పట్టణంలోని కాపులవీధిలోని సాయిబాబా దేవాలయం, పాత కూరగాయల మార్కెట్‌లోని కోదండరామాలయంలోని సాయినాధుని, రామలక్ష్మీ వీవర్స్‌కాలనీలోని సాయిబాబా గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ దర్శించుకున్నారు.

చంద్రబాబును మాదిగలు మరోసారి నమ్మి మోసపోరు

మంద కృష్ణమాదిగ

మచిలీపట్నంటౌన్:టీడీపీ అధినేత నారా చంద్రబాబును మాదిగలు మరో సారి నమ్మి మోసపోయేందుకు సిద్ధంగా లేరని ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఈ నెల చివరి వారంలో నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త మాదిగల చలో హైదరాబాద్ కార్యక్రమ సన్నాహక సమావేశం సోమవారం చిత్రకళా సంసద్ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కృష్ణమాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసి, జాతీయ బీజేపీ పెద్దలతో మాట్లాడి పార్లమెంట్‌లో ఆమోదించేలా చూస్తానని గతంలో చంద్రబాబు చెప్పిన మాటలు విని ఆయనకు మద్దతు ఇచ్చామన్నారు. అయితే చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఈ హామీని విస్మరించి మాదిగలను మోసగించాడన్నారు. అందువల్ల రానున్న కాలంలో మాదిగలు చంద్రబాబును నమ్మి ఓట్లేసే పరిస్థితి లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ

ఈ సమావేశంలో ఎమ్మార్పీస్ కృష్ణాజిల్లా నాయకులు కొల్లూరి బసవ మాదిగ, బీడెల్లి మరియ కుమార్ మాదిగ, దేవరపల్లి అనిత మాదిగ, పేటేటి ప్రభాకర్ మాదిగ, జయరాజు మాదిగ,రాకేష్ మాదిగ,దినేష్ మాదిగ, దావీదు మాదిగ, శ్రీకాంత్ మాదిగ, మౌళి మాదిగ, గోపాలకృష్ణ మాదిగ, నవీన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత



ఆషాబీకి పింఛను అందజేస్తున్న వలంటీర్ జుహేదా

మచిలీపట్నంటౌన్:నగరంలోని 28వ డివిజన్‌కు చెందిన ఆషాబీ అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక ఆంధ్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు వలంటీర్ జుహేదా ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేసింది. ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ షేక్ మొహమ్మద్‌సాహెబ్ సూచనతో ఆషాబీకి పింఛను అందజేసింది. నగరంలో వైఎస్సార్ సీపీ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం 97.65 శాతం పూర్తి చేశారు. నగరంలో మొత్తం 18,460 పింఛన్లు ఉండగా 18,027 మందికి అందజేశారు. ఇంకా 437 మందికి పింఛన్లు అందిస్తే 100 శాతం పంపిణీ పూర్తవుతుంది.

ఘనంగా జాతీయ మెకానిక్ దినోత్సవం

చల్లపల్లి: జాతీయ మెకానిక్ దినోత్సవం సోమవారం చల్లపల్లిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో చల్లపల్లి టూవీలర్ మెకానిక్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ లారీ, ఆటో, ట్రాక్టర్, టూ వీలర్ మెకానిక్‌లను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నబీషూరీ, జిల్లా నాయకులు ఉస్మాన్ షరీఫ్ మాట్లాడుతూ మెకానిక్‌లకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై ఆధునాతన రిపేర్ కిట్స్, నైపుణ్య శిక్షణ, పింఛన్లు, రుణాలు అందించాలని కోరారు.

తొలుత భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.



వేడుకల్లో పాల్గొన్న మెకానిక్‌లు

అసోసియేషన్ చల్లపల్లి అధ్యక్ష, కార్యదర్శులు కొల్లూరి ప్రేమ్‌చంద్, తుమ్మల చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు ముమ్మనేని రాజకుమార్ (నానీ), నాయకులు పాల్గొన్నారు.

అంకమ్మ తల్లికి ఆషాఢ సారె



చల్లపల్లి: ఒకటో వార్డులోని ఉప్పల జమ్మిలంక అంకమ్మ అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. ముత్తయిదువులు పురవీధుల్లో ఆషాఢ సారె ప్రదర్శన నిర్వహించారు. గ్రామదేవత సంపటాలమ్మ అమ్మవారికి, గ్రామంలోని దేవాలయాల్లో ఉన్న అమ్మవార్లకు సారె సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. వేద పండితులు అక్కాపంతుల నరసింహశర్మచే కమిటీ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాకంబరీదేవిగా పార్వతిఅమ్మవారు



బంటుమిల్లి: మండల పరిధిలోని పెద్దతుమిడి గ్రామంలో కొలువై ఉన్న పార్వతి సమేత ఆగస్త్యేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని పలు రకాల కూరగాయలతో శాకంబరీగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు ఎస్.ఈశ్వర శర్మ, శ్రావణ్ కుమార్, ట్రస్టీ చైర్మన్ ఎం.విజయలక్ష్మి, అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.నాగబాబు, ట్రెజరర్ సరేభయ్యాగుప్తా పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించండి

చిలకలపూడి(మచిలీపట్నం):జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అల్లూరి సీతారామరాజు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరాసుల్తానా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు అన్ని పాఠశాలల్లో జయంతి కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలు నిర్వహించిన వివరాలతో తమకు నివేదిక సమర్పించాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు:విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎమర్జెన్సీ వర్క్ కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆశాఖ అధికారులు సోమవారం తెలిపారు. కోడూరు, దింటిమెరక, ఇస్మాయిల్‌బేగ్ పేట, వేటపాలెం, కృష్ణాపురం, నరసింహపురం, జయపురం, స్వతంత్రపురం, నక్కవానిదారి, జరుగువానిపాలెం, ఉల్లిపాలెం, హంసలదీవి, సాలెంపాలెం, వేణుగోపాలపురం గ్రామాల్లో ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. ప్రజలకు తమకు సహకరించాలని కోరారు.

పరిపాలన చేరువయ్యేలా జగనన్న సురక్ష

మంత్రి జోగి రమేష్

పెడన:పరిపాలనా సేవలు ప్రజలకు మరింత చేరవయ్యేలా చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. షాదీఖానాలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష క్యాంపు 2వ సచివాలయ పరిధిలోని 4, 5, 6 వార్డులకు చెందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రరాష్ట్రంలో సంక్షేమ ఫలాలను పేదలకు సీఎం జగన్ అందిస్తున్నారని తెలిపారు. పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చడానికి జగనన్న సురక్ష ఉపకరిస్తుందని చెప్పారు. జేసీ అపరాజితసింగ్ మాట్లాడుతూ 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ధ్రువీకరణ పత్రాలు సంక్షేమ ఫలాలకే కాకుండా విద్యార్థుల చదువులకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం 24 మంది వలంటీర్లను సన్మానించారు. 325 ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజవర్గ పరిశీలకులు తన్నీరు నాగేశ్వరరావు, మునిసిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ ఎండీ ఖాజా, ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, తహసీల్దార్ మధుసూదనరావు, కమిషనర్ మహేంద్ర, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్, జేసీ అపరాజితసింగ్ తదితరులు

జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించండి

కలెక్టర్ రాజాబాబును కోరిన ఎమ్మెల్యే కైలే అనిల్

చిలకలపూడి(మచిలీపట్నం): పామర్రు నియోజకవర్గ పరిధిలోని పేదలకు పట్టాలు ఇచ్చిన నేపథ్యంలో ఏర్పాటు చేసిన లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు త్వరితగతిన కల్పించాలని పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ పి. రాజాబాబును సోమవారం సాయంత్రం ఆయన చాంబర్‌లో కలిసి పలు సమస్యలపై చర్చించారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్లకు అప్రోచ్ రహదారులు, లబ్ధిదారులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సదుపాయాలు ఏర్పాటు చేస్తే లబ్ధిదారులు గృహనిర్మాణానికి ముందుకు వస్తారన్నారు. ఇప్పటికే లేఅవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని చేస్తున్నారని తెలిపారు. వారికి కావాల్సిన నీరు, విద్యుత్ సౌకర్యం, అంతర్గత రహదారులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలన్నారు. పమిడిముక్కల మండలం తాడంకి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలకు కేటాయించిన స్థలాన్ని మార్పు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల పసుమర్రు గ్రామంలో కాలువపడి చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం అందజేయాలన్నారు. అనంతరం పలు సమస్యలపై జేసీ అపరాజితసింగ్, డీఈవో తాహెరాసుల్తానా, డీపీవో నాగేశ్వరనాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సునీతలను కలిసి సమస్యలపై చర్చించారు.



కలెక్టర్ రాజాబాబు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

315 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

బంటుమిల్లి: ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 315 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మెకానిక్‌ల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. యువ గణేష్ మోటారు సైకిల్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రికి చెందిన స్పెషలిస్టులు పాల్గొని పలు రకాల పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యుల కోరిక మేరకు భవనానికి స్థలం మంజూరు చేస్తానని మంత్రి జోగి హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సీఎం వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.రాజబాబు, అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి ఎస్కె అహ్మద్ బాజీ, పటమట శ్రీనివాస్ సభ్యులు పాల్గొన్నారు. మంత్రి జోగిని సభ్యులు సత్కరించారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి జోగి

సమస్యల పరిష్కారం కోరుతూ పోస్టల్ ఉద్యోగుల ధర్నా

మచిలీపట్నంటౌన్:సమస్యల పరిష్కారం కోరుతూ ఆలిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయు గ్రూప్-సి యూనియన్ల గుర్తింపు రద్దును వెంటనే ఉపసంహరించుకోవాలని, ఐపీపీఎస్, యుపీఐ, ఆధార్ ఖాతాలు వంటి అన్ని పథకాలను పనిభారంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంవత్సరం పూర్తి చేసుకున్న జీడీఎస్‌లకు పోస్ట్‌మెన్, ఎంటీఎస్ పరీక్షలు రాయడానికి అవకాశం కల్పించాలని కోరారు. పీఏ, ఎస్ఏ, పోస్ట్‌మెన్, ఎంటీఎస్ ఖాళీలను ముందుగానే గుర్తించి భర్తీ చేయాలని విన్నవించారు. అశాస్త్రీయమైన బిజినెస్ టార్గెట్లను, వందశాతం డెలివరీ పేరుతో చేస్తున్న వేధింపులను విరమించాలని ఎన్‌పీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. సంఘ నాయకులు రమేష్, సీహెచ్ శ్రీనివాసరావు, కెవీ నారాయణ, బీవీ సాంబశివరావు, జీవీ రావు, పి.నాగరాజు, సీహెచ్‌ఎల్ శ్యామలరావు, ఎస్‌వీఎస్ ప్రసాద్, యుపీ రామశర్మ, జీవీ సుబ్బారావు పాల్గొన్నారు.



పోస్టల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా

కోనేరుసెంటర్: ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా తెలిపారు. కృష్ణ విశ్వవిద్యాలయంలో ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్న ఐఎఫ్‌పి (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) శిక్షణ తరగతులను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు ప్రతి అంశాన్ని అవగతం చేసుకొని తరగతి గదుల్లో విద్యార్థుల కోసం ఉపయోగించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు వై ఎస్ ఆర్ కే గురు ప్రసాద్, ఎం వి ఎస్ డి ప్రసాద్, కష్ణా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అలీ మీరజ, పలు మండలాల్లోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి మృతి

కోనేరుసెంటర్: ఆత్మహత్యకు ప్రయత్నించిన ఇంటర్మీడియెట్ విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన బందరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బందరు మండలం రుద్రవరం పంచాయతీ కృష్ణారావు పేటకు చెందిన కొన అజయ్ (17) మచిలీపట్నం నోబుల్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. ఇటీవల ఇంటర్మీడియెట్ ఫలితాలు వెలువడగా అజయ్ ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపం చెంది గత నెల 27వ తేదీన ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతున్న అజయ్ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ట్యాలీ 3.0 పై అవగాహన

మచిలీపట్నంటౌన్:కృష్ణా జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, ఎకౌంట్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ట్యాలీ 3.0 పై అవగాహన సదస్సు నిర్వహించారు. ట్యాలీ సంస్థ ప్రతినిధి జ్ఞానేశ్వర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యాపారులకు సందేహాలు నివృత్తి చేశారు. ఎకౌంటెంట్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, ఉపేంద్ర తదితరులున్నారు.